# టెర్రరిజంకు చట్టాలే పరిష్కారమా?


కె.బాలగోపాల్

**నేరాలు చట్టం లేమి నుంచి పుట్టలేదు, చట్టం ఉనికి వల్ల ఆగిపోవు. టెర్రరిజం అనే దానిలో ఉన్మాదం తప్ప వేరే ఏమీ లేదనే వెర్రి విడనాడాలి. అమాయకులను హతమార్చడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని ఎంత నిస్సంకోచంగా అందరం అంటున్నామో, అంతే స్పష్టంగా పరిష్కారం దొరకని సమస్యలు, పరిహారం దొరకని అన్యాయం సమాజంలో చాలా వుందని గుర్తించడం అవసరం. ఈ బాధ్యతను సమాజం నిర్వర్తించడానికి సిద్ధంగా ఉందా?**

ముంబయిలో జరిగిన దాడుల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఒక చట్ట సవరణ చేసింది. ఒక కొత్త చట్టం తెచ్చింది. విచిత్రమేమిటంటే ఇదే సమయంలో సాధారణ నేరాల విషయంలో పోలీసుల అధికారాలను తగ్గించే సవరణలను కూడ అదే ప్రభుత్వం చేపట్టింది. టెర్రరిజం పేరు మీద ప్రభుత్వం గతంలో చేపట్టిన చట్టాలన్నీ రాజ్యాంగ బద్ధమేనని సమర్థించిన న్యాయస్థానాలే, సాధారణ నేరాల విషయంలో పోలీసులకు అనవసరమయిన అధికారాలు కట్టబెట్టడం రాజ్యాంగ స్ఫూర్తికీ అంతర్జాతీయ మానవహక్కుల నియమాల స్ఫూర్తికీ విరుద్ధం అని కొంతకాలంగా అంటూ వచ్చాయి. న్యాయస్థానాలు పెట్టిన ఒత్తిడి వల్లే ఈ సవరణలను ప్రభుత్వం చేపట్టింది. ఇక్కడ 'సాధారణ నేరాలు' అంటే అర్థం సాధారణ నేర స్మృతి వర్తించే నేరాలనే తప్ప అందులో అనైతికమైనవీ అసాంఘికమైనవీ లేవని కాదు. 7 సంవత్సరాల కంటే తక్కువ జైలు శిక్ష పడగల నేరాలలో కేసు నమోదు చేసినంత మాత్రాన అరెస్టు చేయనక్కర లేదనీ అరెస్టు చేయకుండానే పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకుని విచారించి పంపించవచ్చునీ వీటిలో ఒక చట్ట సవరణ అంటుంది. 7 సంవత్సరాలకంటే తక్కువ శిక్ష పడగల నేరాలలో అంటరానితనం, గృహహింసల నుంచి (వివిధ రకాల) చీటింగ్ దాకా హేయమైన నేరాలనేకం ఉన్నాయి.

నేరం అసాంఘికమైనదా కాదా అన్న విచక్షణ నుంచి చూద్దాం. నేరం అసాంఘికమైనదా కాదా అన్న విచక్షణ లేకుండ నేరపరిశోధనలో అనవసరమైన కాఠిన్యం ఉండొద్దనడం వెనక ఒక ఆలోచన ఉంది. నాగరికం అనిపించుకోదలచుకున్న సమాజం అన్ని విషయాలలోను నాగరికంగా నడుచుకోవాలి. నేరం అనాగరికం కావచ్చును గానీ నేర విచారణ అనాగరికంగా ఉండడానికి వీలులేదు. అంతా సజావుగా ఉన్నప్పుడు నాగరికంగా నడుచుకుంటాము గానీ సంక్షోభం వచ్చినప్పుడు విచ్చలవిడిగా అణచివేత ప్రయోగిస్తామనేది కేవలం విలువలలో ద్వంద్వ వైఖరే కాదు, నాగరికత నిజమైన అర్థాన్ని గ్రహించని వైఖరి. అది సమస్యలను తొక్కి పెడుతుందే తప్ప పరిష్కరించదు. ప్రజాస్వామ్యమే క్లిష్టమైన సామాజిక సమస్యలకు సహితం సరయిన పరిష్కార మార్గం అన్న అవగాహన కొరవడిన కారణంగానే బాంబులు పేలుతున్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని గురించి, ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడొద్దు అనే వింత వాదన ముందుకొస్తున్నది.

ఇప్పుడు కొత్తగా వచ్చిన చట్టము, చట్ట సవరణ ప్రజాస్వామికమయినవని అనగలమా? అవి వంద ప్రాణాలను కాపాడడానికి ఇద్దరి స్వేచ్ఛను హరించే చట్టాలయి వుంటే ఈ ప్రశ్నకూ దాని నుంచి పుట్టగల చర్చకూ కనీసం అర్థం వుంది. (అయినప్పటికీ జవాబు సులభం కాక పోవచ్చుననేది వేరే సంగతి) కానీ అవి చాలామంది స్వేచ్ఛనయితే హరిస్తాయి గానీ ఎవరి ప్రాణాలనూ కాపాడతాయన్న భరోసా లేదు. నేరానికి సంబంధించిన సత్యాన్ని కనుక్కోవడానికి కావలసిన నేర్పును ఈ చట్టాలు పెంచవని ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. దానికి కావలసిన పరిశోధనా పరికరాలను కూడ కొత్తగా ఇయ్యవు. సత్యం కనుక్కోలేని పోలీసుల అనుమానం నిరాధారం అని రుజువుచేసుకొనే బాధ్యతను అనేక రూపాలలో ముద్దాయిపైన పెట్టడం ఈ చట్టాలలోని ఒక ముఖ్య విషయం. నేరానికి ఉపయోగించిన వస్తువు ఒకరి దగ్గర దొరికితే ఆ వ్యక్తే నేరం చేశాడని చట్టం భావిస్తుందనీ చేయలేదని తానే రుజువు చేసుకోవాలనీ అంటే అదొక రకం. కానీ 'ఆ కోవకు చెందిన వస్తువు' లేక 'అటువంటి ఆయుధం' ఒక వ్యక్తి దగ్గర దొరికినా నేరం అతనే చేశాడని కోర్టు భావిస్తుందంటే ఏమర్థం? హత్య గొడ్డలితో చేసినట్టయితే గొడ్డలిగల ఏ వ్యక్తినయినా తీసుకొచ్చి నేరం నువ్వు చేయలేదని రుజువు చేసుకొమ్మనవచ్చు. నేర స్థలంలో గాని, నేర ప్రక్రియకు సంబంధించిన ఏ వస్తువుపైన గానీ ఒక వ్యక్తికి సంబంధించిన ఏ చిహ్నం లభించినా ఇక అతనే నేరం చేసినట్టు కోర్టు భావిస్తుంది. నేరం చేయలేదని అతనే రుజువు చేసుకోవాలి. అనుమానితుడి జేబురుమాలును నేరస్థలం దగ్గర పడేసి నేరం నువ్వు చేయలేదని రుజువు చేసుకొమ్మనడానికి ఆటంకం ఏముంది? సాధారణ నేరస్మృతిలో ముద్దాయిని మొదటిసారి రెండు



వారాల కోసం రిమాండు చేసినప్పుడు మాత్రమే, ఆ రెండు వారాలలో ఎప్పుడయినా పోలీస్ కస్టడీకి అప్పగించవచ్చు. ఆ తరువాత జైలుకే తప్ప పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి వీలు లేదు. కాబట్టి పోలీస్ కస్టడీలో చిత్ర హింసలు పెట్టినా కూడ తట్టుకోవచ్చు, తట్టుకొని రెండవసారి రిమాండు పొడిగింపు కోసం కోర్టులో హాజరు పెట్టినప్పుడు కోర్టుకు ఫిర్యాదు చేయవచ్చు. ప్రస్తుత చట్ట సవరణలో ముద్దాయి రిమాండులో ఉన్న కాలంలో ఎప్పుడయినా పోలీస్ కస్టడీకి ఇయ్యవచ్చు. ఎన్నిసార్లయినా ఇయ్యవచ్చు. దీనివల్ల ఇక ముద్దాయి చిత్ర హింసలు గురించి కోర్టులో ధైర్యంగా ఫిర్యాదు చేయడు. ఎందుకంటే మళ్లీ ఎప్పుడయినా అతనిని పోలీస్ కస్టడీకి పంపవచ్చును కాబట్టి. పోనీ రిమాండు త్వరగా అయిపోతుందా అంటే అదేం లేదు. చార్జిషీటు 180 రోజుల దాకా దాఖలు చేయనక్కర లేదు. బెయిలంటారా ముద్దాయి నిర్దోషి అని కోర్టు భావిస్తే తప్ప బెయిలు ఇవ్వడానికి వీలులేదు. ముద్దాయి దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన విదేశీయుడయితే అప్పుడసలే ఇవ్వడానికి వీలులేదు- ఏవైనా ప్రత్యేక పరిస్థితులు ఉంటే తప్ప. ముంబాయి దాడిలో పట్టుబడ్డ మహ్మద్ అజ్మల్ కసావ్‌ను తలచుకొని 'అతనికి బెయిల్ రాక పోతే ఏమిలే' అనొద్దు. ఇది అతనికే కాదు, 2007లో హైదరాబాద్‌లోని టప్పాచబుత్రాలో అరెస్టయిన స్కూల్ బ్యాగులు కుట్టి అమ్ముకొని బతికే బంగ్లాదేశీలకూ వర్తిస్తుంది. వాళ్లప్పుడు సాధారణ చట్టాల కింద అరెస్టు చేశారు కాబట్టి వారికి కొంత కాలానికి బెయిలు దొరికింది. ఈ చట్ట సవరణలు ఉండి ఉంటే వారికిప్పటికీ బెయిలు దొరికి ఉండేది కాదు. వారి పిల్లలు కార్వాన్ వీధుల్లో అడుక్కుంటుండేవారు.

ఇవి చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (యు.ఎ.పి.ఎ)లో కొత్తగా వచ్చిన సవరణలు. కొత్తగా చేసిన చట్టం పేరు జాతీయ నేరపరిశోధక సంస్థ చట్టం. టెర్రరిస్టు నేరాలు ఒక రాష్ట్రానికి పరిమితమైనవి కావు కాబట్టి వాటి పరిశోధనకు కేంద్ర ప్రభుత్వ సంస్థను నెలకొల్పడం ఈ చట్టం ఉద్దేశ్యం అని చెప్పారు. ఇది ఎవరికైనా హేతుబద్ధంగానే తోస్తుంది. అయితే ఒక కొత్త పోలీసు వ్యవస్థను ఉనికిలోకి తెస్తూ ఆ పోలీసు వ్యవస్థ పరిశోధించే నేరాల విచారణ ఏ విధంగా జరగాలన్న నియమాలను కూడ ఆ చట్టంలోనే చేర్చారు. పోలీసు చట్టంలో నేర విచారణ విధానాన్ని నిర్దేశించడం కొత్త ప్రయోగం. ఇదివరకెప్పుడూ జరగలేదు. విమర్శకుల దృష్టి యుఎపిఎ లోని సవరణలపైనే ఉంటుందనీ ఈ చట్టం మీదికి రాదనీ అనుకున్నారేమో తెలీదు. లేదా ఈ కొత్త పోలీసు యంత్రాంగం పరిశోధించే కేవలం టెర్రరిస్టు నేరాలనే కాదు కాబట్టి ఈ పద్ధతిలో నేర విచారణ ప్రక్రియ పతనాన్ని మరింత విస్తృతం చేయవచ్చునని భావించారేమో తెలీదు. దీని సారాంశం ఏమిటంటే నేర విచారణ ప్రక్రియ బహిరంగంగా జరగాలి, ముద్దాయి సమక్షంలో జరగాలి అన్న సహజ న్యాయసూత్రాన్ని విడనాడి, బయటి ప్రపంచంనుంచే కాదు, కొంత మేరకు ముద్దాయి నుంచి కూడ దానిని రహస్యంగా ఉంచే విధానాన్ని ప్రవేశపెట్టడం. ఇవి మన భద్రతను పెంచుతాయా? నేరాలను అరికట్టడంలో పోలీసుల సామర్థ్యాన్ని పెంచుతాయా? అంటే అదే మీ లేదనేది స్పష్టమే. నేరం చేశామో లేదో స్పష్టంగా రుజువు కాని వ్యక్తులకు గుట్టుచప్పుడు కాకుండా శిక్ష వేసేసి కేసులు మూసేయడం మాత్రం జరుగుతుంది. మళ్లీ ఇంకొక మారణకాండ జరిగిన నాడు ఇది ఏపాటి భద్రత కల్పించిందో అర్థం అవుతుంది.

మరేం చేయాలి? అని ఆవేశపడనవసరం లేదు. టెర్రరిజానికి సంబంధించిన చర్చ యావత్తూ చట్టాల చుట్టు, కోర్టుల చుట్టు తిరిగినంత కాలం కఠినమైన చట్టాలు కాక వేరే ఏం పరిష్కారం ఉంది అనే అనిపిస్తుంది. కాని నేరాలు చట్టం లేమి నుంచి పుట్ట లేదు, చట్టం ఉనికి వల్ల ఆగిపోవు. దానికి కావలసింది వేరే కృషి. మొదట, టెర్రరిజం అనే దానిలో ఉన్మాదం తప్ప వేరే ఏమీ లేదనే వెర్రి విడనాడాలి. అమాయకులను హతమార్చడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని ఎంత నిస్సంకోచంగా అందరం అంటున్నామో, అంతే స్పష్టంగా పరిష్కారం దొరకని సమస్యలు, పరిహారం దొరకని అన్యాయం సమాజంలో చాలా వుందని గుర్తించడం అవసరం. ఆ గుర్తింపును బహిరంగంగా ప్రకటించి, అయినప్పటికీ విచ్చలవిడి హింసాకాండ వైపు పోవద్దని బాధితులకు పిలుపునివ్వడం అవసరం. కాని ఈ బాధ్యతను సమాజం నిర్వర్తించడానికి సిద్ధంగా ఉందా? ఒక్క ముస్లిం మత పెద్దలు మాత్రం ఇటీవల తమ బాధ్యతను గుర్తించారు. గడచిన సంవత్సర కాలంలో రెండు మూడుసార్లు పెద్ద స్థాయిలో సదస్సులు నిర్వహించి ఇస్లాం పేరుమీద జరుగుతున్న హింస ఇస్లాంకు వ్యతిరేకమని తీర్మానాలు చేశారు. విలేఖరులడిగితే మొగమాటానికి ఖండించడం కాదు, తామే సదస్సులు నిర్వహించి ఆ పని చేశారు. కాగా, హిందువుల ప్రతినిధులుగా తమను తాము చెప్పుకొనే ఏ శంకరాచార్యుల వారూ గుజరాత్ మారణకాండగానీ ఈ మధ్య ఒరిస్సాలో కర్ణాటకలో జరిగిన మారణకాండ గానీ అన్యాయం అనగా మనం వినలేదు. అనకపోగా ఈ స్వాములు కొందరు ఈ మారణకాండలు నిర్వహించిన విశ్వ హిందూ పరిషత్ తదితర సంఘ్ పరివార్ సంస్థల వేదిక లెక్కి మాట్లాడుతుంటారు. అయితే ఒక్క స్వాములూ, ఉలేమాలే కాదు,అందరం స్పందించాలి. కేవలం మత హింస గురించే కాదు, అన్ని రకాల సంఘటిత హింసాకాండలోనూ దాని సామాజిక స్వభావాన్ని నిర్మొగమాటంగా గుర్తించడం, అందులో అన్యాయం ఉంటే దాని పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునివ్వడం, దానితో పాటు ఎవ్వరూ విచ్చలవిడి హింసాకాండకు పాల్పడవద్దని వారించడం అవసరం. ఇది చాటుమాటున కాదు, బహిరంగంగా జరగాలి. ఒక కార్యక్రమంగా జరగాలి. అప్పుడు నేరస్మృతిని వికృతంగా తయారు చేసే ప్రయోగాల అవసరం లేకుండ సమస్యను పరిష్కరించుకోగలుగుతాం.